


ఉదయం ఎనిమిది గంటలకి హెడ్ మాష్టరుగారికి స్కూల్ ఫైనల్ పరీక్షా ఫలితాల జాబితా చేరింది.

# పోడౌవిడి రాయళ్ళు

తొమ్మిది గంటలు కాకుండానే రామయ్య ప్యాస్ అయాడని ఊరంతటా పొక్కిపోయింది. ఆ శుభవార్త నాకు తెలియగానే, మా క్లబ్బుకు బయలుదేరాను. మా క్లబ్బంటే ఆ ఊళ్ళో సత్రపు అరుగులు. అక్కడికి


న్యాయమూర్తి శ్రీ కందా భీమశంకరం

చేరి, సత్రపు నౌకరు వెంకన్నను పిలిచి నా ముఖ్య స్నేహితులకు కబురు చేశాను. నవ్వుకుంటూ, కేకలువేస్తూ, పరుగెత్తుకొని రామారావు, విస్సప్ప, సుబ్బన్న వచ్చారు. సుబ్బన్న తప్ప, మేము అప్పుడు ఫిఫ్తుఫారం చదువుతున్నాం. మాతో ఫోర్తుఫారం చదివి, సుబ్బన్న ఫేలయాడు; తెలివితేటలు లేక కాదు, తెలుగుకవిత్వంలో పడి.


వారు రాగానే, రామయ్య పొందిన ఈ ఘనవిజయాన్ని గుర్తించి, అతని యెడల స్థానిక విద్యార్థి లోకానికి గల గౌరవమూ అభిమానమూ ఉచిత రీతిని ప్రకటించేందుకు ఏదో ఏర్పాటుచేయాలనే తీర్మానాన్ని నేను ప్రతిపాదించాను. వారు ఆమోదించారు.

రామయ్య యెడల మాకు ఈ భావాలు ఉండడానికి కారణం చెప్తా. అతని తండ్రి, ఆ ఊరికి పదిమైళ్లలోపు దూరంలో ఉన్న ఒక గ్రామానికి కరణంగారు. వారిది బాగా ఆస్తిగల కుటుంబం. ముగ్గురు అన్నదమ్ములకు, ఇతడు తప్ప వేరే సంతానం లేదు. ఇతని చదువుకోసం, ప్రత్యేకం కాపురం పెట్టి, ఒక పినతండ్రి, అతని భార్య, పది సంవత్సరాలు పైగా ఆ ఊళ్లో ఉంటున్నారు. అప్పటికి సుమారు ఇరవై పళ్లుంటాయి రామయ్యకు. స్కూలు ఫైనల్ క్లాసులోనే నాలుగైదేళ్లనుంచీ ఉంటూ ఉన్నాడు. ఇంచుమించు ఆరడుగుల పొడుగు, దానికి తగిన పుష్టి, నిండైన గుండ్రని మొహం, తెల్లపాపల పెద్దకండ్లు, కత్తి తగలని నూనూగు మీసం, మొట్టమొదట చూసిన వారికి భయం వేసేటట్లుండేవాడు. విగ్రహం ఇలా ఉన్నా అతని హృదయం అతి సున్నితమైనది. ఎప్పుడూ, ఎవరికో, ఏదో ఉపకారం చేయడమే అతని వృత్తి అన్నట్లు వర్తించేవాడు. పుస్తక పఠనం మాత్రం అతనికి కిట్టేదికాదు. ఒకరు ఇంగ్లీషు చెప్పి, ఇంకొకరు హిస్టరీ చెప్పి, మరొకళ్లు లెఖ్ఖలు చెప్పి – తంటాలు పడి, అతన్ని ప్యాస్ చేసేందుకు అతని ఉపాధ్యాయులు ప్రయత్నిస్తుండేవారు. అతని నమ్రతా, విధేయతా, మౌనమూ, చిరునవ్వూ చూసి, సహాధ్యాయులకు కూడా చదువు విషయమై అతన్ని మందలించడానికి మనస్సు ఒప్పేది కాదు.

అందుచేత, అట్టివాడు పరీక్షలో కృతార్థుడయాడంటే మాకందరికీ పండుగలాగుండడం సహజం కదా! ఆ రోజు శుక్రవారం. మా స్కూలు సోమవారం తెరుస్తారు. ఆదివారం

ఉదయానికి పై వూళ్లనుంచి వచ్చే విద్యార్థులుకూడా ఆ వూరు చేరుకుంటారు. కాబట్టి ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు స్కూలు ప్లే గ్రౌండులో సన్మానసభ చేద్దా మని మేము నిశ్చయానికి వచ్చాం. సుబ్బన్న అభినందనపద్యాలు వ్రాసుకు వస్తా నన్నాడు. వాళ్ల దొడ్లో పూసే పువ్వులతో తన చెల్లెలిచేత ఒక పెద్ద దండ తయారు చేయించి తీసుకొని వస్తూ, సమయోచితమైన ఒక ఇంగ్లీషు ఉపన్యాసం వల్లెవేసుకు వస్తా నన్నాడు, మా విస్సప్ప. ప్రత్యేకం చేయగలినది ఏమీ తోచక, ఆ సభకు అధ్యక్షుడుగా ఉంటా నన్నాను నేను. మే మీ నిర్ణయాలకు వస్తూంటే గుంపులు గుంపులుగా విద్యార్థులు, తదితరులు కూడా ఆ అరుగులమీద చేరారు. వా రందరికీ, నేను మా తీర్మానం ప్రకటించాను.

ఇంతట్లో, ఎక్కడినుంచి వచ్చాడో వచ్చాడు వెంకటేశ్వర్లు. రావడమేమిటి, అందరినీ తోసుకుని, నేను కూర్చున్న స్థలానికి చేరాడు, మాంచి హడావిడిగా! వెంకటేశ్వర్లంటే మాకు ఎంతో గౌరవం. ఆ ఊళ్ళో అతన్ని కళారాధకులలో అగ్రగణ్యుడుగా గణించే వాళ్లం. చక్కని చామన చాయరంగూ, వంకలు తిరిగి దట్టము




"చెప్పు, ఆ పర్సు ఎందుకు దొంగిలించావ్?"
"ఈ మధ్య నా వొంట్లో బాగా ఉండడం లేదు;
స్థలం మారిస్తే మంచి దని ........"

గానూ పొడుగ్గానూ ఉండే భావకవి క్రాఫూ, ఫ్రెంచివిస్కర్సుమాత్రమే ఉండి, మీసమూ గడ్డమూ లేని కోల మొహం, కాటుకకళ్లు, సన్నని పొడవైన నిటారుముక్కూ-అతడు చూపును ఆకర్షించేవాడు. ఆ ఊళ్లో ఏ మందగొడిగానైనా, సజీవంగానే ఉన్న 'ఆంధ్రా అమెచ్యూర్ డ్రేమటిక్ ట్రూపు' అనే సంస్థకు అతడు పట్టుగొమ్మ. తలా, చేతులూ కదుపుకుంటూ కూనిరాగాలు తీస్తూ, అతడు వీధుల్లో నడుస్తూంటే, అతనివెంటపడే వాళ్లు మాలో కొందరు. ఈ పద్యం చదవమనీ, ఆ పాట పాడమనీ. వయస్సూ, స్వాతంత్ర్యం వచ్చాక, అతనిలాగ నొక్కునొక్కుల ఒత్తుజుట్టు పెంచు

కోవా లన్నది, ఆ రోజులలో నాకు ఉండే రహస్యపు ఆశయాలలో ఒకటి. అలా మాలోకి చొరబడి నిల్చుని, ఆ గుంపువైపు ఇటూ అటూ తిరుగుతూ సరిగ్గా ఈ మాటలతో కాకపోయినా, ఈ ధోరణిలో పానుగంటి వారి సాక్షిలోలాగా ఉపన్యసించాడు.

"స్నేహితులారా ఇది పర్వదినం. రామయ్య ప్యాస్ అయాడంటే, మనలో ఎవరికివారే తమ జీవితంలో ఒక విశేష శుభం జరిగినట్లుగా సంతోషిస్తున్నాం. 'తమ కార్యంబు పరిత్యజించియు, పరార్థ ప్రాపకుల్' అన్నాడు భర్తృహరి, ఏనుగు లక్ష్మణ కవి తర్జుమాద్వారా. అటువంటివాడు రామయ్య అని ఘంటాపథంగా చెప్పగలను; ఇది ఉత్ప్రేక్ష కాదు; నిస్సంశయంగా సత్యం. అతని సౌమనస్యం, సౌహార్దం, శాంతం, అతని విశాల హృదయం ఎరుగనివారెవరు మనలో? అయితేం, ఈ సంతోషంలో, నా మనస్సులో కొంచెం విచారంకూడా వచ్చి కలుస్తోంది. ఎందు చేతనంటే, రామయ్య చదువు ఇంతటితో ఆగేది కాదు; కాలేజీలో చేరుతాడు. ఏ గుంటూరో, ఏ బందరో పోతాడు. అప్పుడు, ఈ ఊళ్ళో కేవల విద్యారాధకులై శరీర వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేసే నీరసులను బుజ్జగించి, ఏదో ఆటలో చేర్పించేవా ళ్ళెవరు? పూటకూళ్లవాళ్లు శుభ్రమైన, ఆరోగ్యదాయకమైన ఆహారం పై ఊళ్ల పిల్లలకు పెడుతున్నారో లేదో పర్యవేక్షణ చేసేవా రెవరు? తుంటరివాళ్లు చిన్నవాళ్ళను బెదరిస్తూంటే, ఆ క్రౌర్యాన్ని అటకాయించేవా రెవరు? పరధ్యానం పడి, ఎక్కడపడితే అక్కడ తమ పుస్తకాలు, పెన్సిల్సు మరచిపోయే దద్దమ్మల వెనకాల పరుగెత్తుకువచ్చి, 'ఇదిగో నీపుస్తకం, ఇదిగో నీ పెన్సిలు' అని తీసుకువచ్చి ఇకముందు ఎవరు అందిస్తారు? Foot ball ఆడుతూంటే కాలు తగిలో, బాలు తగిలో క్రింద పడ్డ కుఱ్ఱకుంకలను లేవనెత్తి, వారి బాధ, అవమానఖేదం ఉపశమనం చేయడానికి ఎవరు ఇకముందు ప్రయత్నిస్తారు? చీకటిపడేవరకూ ఆటలాడి, ఒంటరిగా ఇంటికి పోవడానికి భయపడే బెదురుగొడ్డును, ఇంటికి ఎవరు చేరుస్తారు ఇకమీద? కాబట్టి నేను నొక్కివక్కాణించేది ఏమిటంటే రామయ్యను గౌరవించడానికి మీరు నిర్ణయించుకున్న ఏర్పాటు బొత్తిగా అల్పంగా ఉందని. నా సలహా యిది. సముద్రపు రేవు బంగాళాలో ఒక పిక్నిక్ ఏర్పాటు చేద్దాం. ఎల్లుండి ఆది

వారం. ఆ విధంగా మన ఆనందాన్ని ప్రకటిస్తూ అక్కడే తగురీతిని అతన్ని గౌరవిద్దాం. ఏమంటారు? ఈ పిక్‌నిక్‌కు నా చందాగా ప్రస్తుతం నా జేబులో నున్న ఒక రూపాయి, వీరికి యిస్తున్నా' అని తన గంభీరోపన్యాసం ముగిస్తూ, నా వైపు ఒక రూపాయి నోటు విసిరి, తటాలున కూర్చున్నాడు. 'రామయ్యకు జై, వెంకటేశ్వర్లుకు జై' అనే హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. చేతులు జేబుల్లోకి పోతూండడంచూచి, నేనూ, సుబ్బన్నా నా జేబురుమాలు సభవారిముందు పరిచాం. వడగళ్ల వానలాగా టపటపా గబగబా నాణ్యాలు కురిశాయి. అన్నీ చేర్చి మొత్తం అంతా మూడుమార్లు లెక్క పెడితే ఆరురూపాయిలపంద్రెండణాల ఆరుపైసలు తేలింది. లేచి నిల్చుని ఇలా అన్నాను. "సోదరులారా, మీరు మీ చర్యలవల్ల ఆమోదించిన ఈ పిక్‌నిక్‌కు అధమం ఇరవై రూపాయిలు ఖర్చవుతుంది. అనగా ఇంకా పదమూడు రూపాయిల మూడు అణాల ఆరుపైసలు కావాలి. ఆదివారం ఎల్లుండే; టైము తక్కువ. కాబట్టి రేపు మధ్యాహ్నం మూడు గంటలలోగా సుబ్బన్నకు మీరు ఇంకా చందాలు ఇచ్చి, సొమ్ము భద్రీ-



కొత్తగా జేరిన గుమాస్తా నమస్కారం చేయలేదని —

**ఆఫీసరు:** నే నెవరినో తెలుసా? ఈ ఆఫీసులో మీలాంటి 20 మందిపైన అధికారిని. నాకు 2000 జీతం.

**గుమాస్తా:** జీతం బాగుంది. ఈ ఉద్యోగం మాత్రం వదలకండి.


---

చెయ్యాలి. ఏర్పాట్లన్నీ మేము చేస్తాం. ఆదివారం తెల్లవారకట్ల అయిదు గంటలకు సుబ్బన్న రూమువద్ద అందరం తిరిగి కలుద్దాం. ఇప్పుడే పోయి, ఈ ఏర్పాటుకు రామయ్యను ఒప్పిస్తాం," అని లేచి, నేనూ, సుబ్బన్నా, విస్సప్పా బయలుదేరాం. మా వెనకాల వెంకటేశ్వర్లుకూడా వచ్చాడు. మేము చేరేటప్పటికి రామయ్య ఇల్లు చాలా సందడిగా ఉంది. చుట్టుపక్కల ఇళ్ళ బాలబాలికలు అతనిచుట్టూచేరి, చప్పట్లు

కొడుతూ-వేళాకోళాలు చేస్తున్నాడు. అమాయకపు చూపుతో చిరునవ్వుతో తలకొంచెం వంచుకు కూర్చున్నాడతను. వెళ్ళీవెళ్ళడంతోనే "ఓయి, పిల్లలూ" అని వెంకటేశ్వర్లు రంగస్థల రాక్షసుడులాగ ఎగురుతూ ఒక పెద్ద కేకవేసి, ఆ గుంపు చెల్లాచెదరయ్యేటట్లు చేశాడు. లేచి మమ్మల్ని ఒక్కొక్కరినీ కౌగలించుకున్నాడు రామయ్య. ఒక వైపుకు మొహంవంచి, "నిజమని నమ్మలేకపోతున్నాను" అన్నాడు మెల్లిగా. అతనికి మా ఏర్పాటు తెలియజేశాం. "ఎందుకు ఇంత ఆడంబరం" అన్నాడు మొహం వంచుకునే. అయితేం-చివరకు ఒప్పించాం. మేము వచ్చేశాం. వెంకటేశ్వర్లు ఇంకా కొంచెం సేపు ఉంటానన్నాడు.

శనివారం మూడు గంటలు కాకుండానే, కావలసిన సొమ్ము పోగైంది. మరునాటి భోజనం ఏర్పాట్లు హోటలువానితో ఆ సాయంత్రం చేసేశాం. ఆదివారం తెల్లవారు ఝామున నాలుగు అయిదూ గంటల లోపున సుబ్బన్న రూమువద్ద సమావేశమై రామయ్య యింటికి పోయి, మేలుకొలుపు పాటలు పాడుతూ, చప్పట్లు కొట్టుకుంటూ నడిచి, బీచి బంగళా చేరాము, ఏడుగంటలకు. మేము చేరేటప్పటికి, ఏం చెప్పం, అక్కడ మాంచి హడావిడిగా వుంది; వరండామీద ఒక స్టేజి తయారవుతోంది; అయిదారుగురు పని చేస్తూన్నారు. రెండు మూడు కర్టెన్లు, ఒక హార్మోనియం, ఒక మద్దెల, ఒక ప్రక్క ఉన్నాయి. మా కర్మం కాలి, మేము పెట్టుకున్న రోజునే, ఇంకెవరైనా పార్టీ ఏర్పాటు చేసుకున్నారా చెప్మా అని ఆశ్చర్య పడుతున్నాం. ఇంతట్లో పక్కగదిలోనుంచి, వెంకటేశ్వర్లు ప్రత్యేక్షమై, "ఒరే పిల్లలూ, ఈ ఏర్పాట్లన్నీ, మా ట్రూప్ ప్రెసిడెంటుగారితో చెప్పి, చేశాను. పాండవ విజయంలోని రెండు మూడు రంగాలు సాయంత్రం, నేనూ, ఈ నా స్నేహితులూ ప్రదర్శిస్తాం. రామయ్య తండ్రి మాకు పాతిక రూపాయిలు చందా ఇచ్చారు. రంగమ్మ హోటలు లోంచి మధ్యాహ్ననికి ఫలహారాలుకూడా వస్తాయి," అన్నాడు. "బలే, బలే" అని అందరం అరిచాం. ఆ రోజల్లా ఆ సముద్రపు రేవున గడిపివేశాం. స్నానాలు చేసి, పదకొండు గంటలకు భోజనాలు ముగించాం. ఇంతట్లో స్టేజి పూర్తిగా తయారైంది. భోజనం ముగించామో లేదో, మద్దెల వాణ్ణి వెంకటేశ్వర్లు మద్దెల వాయించ

మన్నాడు. వాడితో సమానమైన వాద్యాగాడు దక్షిణాదిని కూడా లేనేలేడన్నాడు. మేం కుర్రవాళ్లం, వాడిప్రజ్ఞ మాకేం తెలుస్తుంది. వాయిస్తూంటే వాడి ముఖవైఖరి మాత్రం మమ్మల్ని విశేషంగా ఆకర్షించింది. వాడికి పెద్ద దయ్యాపు జుట్టు ముడి ఉంది. వాయిద్యం మొదలెట్టాడో — లేదో, అది విడిపోయి, వెంట్రుకలు చెల్లాచెదరై మొహం మీద ఏకుతూన్న దూదిలాగా ఎగిరి పడడం ప్రారంభించాయి, కళ్లల్లో పడుతూ. అది వాడి కలవాటైపోయి ఉండాలి; ఏ మాత్రం చికాకు పడకుండా, మద్దెలతో కసిగా కుస్తీపడుతూన్నట్టు, గట్టిగా బాదేశాడు. వెంకటేశ్వర్లు తల ఊపుతూ, లయకొడుతూ, తన్మయత్వం మొహంలో ప్రకటిస్తూ, వింటున్నాడు. అక్కడ అంత గాలి వేస్తున్నా ముచ్చెమటలు పట్టేయి, వాడు వాయిద్యం ముగించేప్పటికి. వాడు ఆపేడో లేదో, హార్మోనియం వాద్యగాడు మొదలెట్టాడు. రెండు గంటలు వాడు, వాడి ప్రావీణ్యం ప్రకటించాడు. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒక పాతిక నాటకపు పద్యాలు చదివాడు, ఉత్తమ నాటకశైలిన. టిఫిన్ ముగించాక, వెంకటేశ్వర్లు




తండ్రి : "ఒరేయి రామూ! నీకు నీ చదువుకు అంతపెద్ద బల్బు ఎందుకురా? ఎక్కువ కరెంటు ఖర్చు కాదూ?"

రాము : "బల్బు మనది కాదులె? నాన్నా! పక్కింటి వాళ్ళది"

---

అన్నాడు, "ఇంకో అరగంటలో మా నాటకం మొదలెడతాం. ఈ లోపున మంచి పాటలు పాడుతాడు, ఈ శేషగిరి. చాలా బాగుంటాయి వినండి." ఆ శేషగిరి కోడిపాట, రైలుపాట పాడాడు. వన్సుమోర్ లతో ఒక్కొక్కటి అయిదారుమాట్లు. ఇంతట్లో నాటకం మొదలుపెట్టారు. టిఫినుకీ, చల్లగాలికీ, నడిచివచ్చిన ఆయాసానికీ, కునికిపాట్లు రాగా మాలో కొందరు వరండా గోడకు ఆని, గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. ఈ హడావుడిలో రామయ్య సంగతే మరచి పోయాం, అందరం. వాడూ



మాతోపాటు ఏదో పార్టీకి వచ్చిన వాళ్లలో ఒకరిలాగ ఉన్నాడు. సన్మాన సభ మాటే ఎత్తలేదు ఎవరూ. నాటకం అయాక అందరం నిద్ర మత్తుతో ఇంటికి ఎనిమిది గంటలకు చేరుకున్నాం. ఆమత్తులోనే, నాతో, మెల్లిగా విస్సప్ప ఇలా అన్నాడు, "ఈ రోజు పార్టీ మనదీకాదు, రామయ్యదీకాదు వెంకటేశ్వర్లుది..... రామయ్యా విజయంకాదు-ఇది వెంకటేశ్వర్లు విజయంలా అయింది." అంటే, వెర్రి వేళాకోళంగా 'పాండవ విజయంకాదూ ?' అని నేనన్నాను.

కాని, మరునాడు మా మనస్సులు సద్దుకోగలిగాం. ఎంచేతంటే, సోమవారం తొమ్మిది గంటలకు హెడ్మాష్టరుగారికి తంతివచ్చింది, రామయ్యా పేరు లిస్టులో పొరపాటున పడిందని. గుప్పు మని ఆ దుష్టవార్త అయిదు నిముషాల్లో బడిలో ప్రచురమైంది. ఆ సాయంత్రం ఇంటికి పోయేముందు మా క్లబ్బులో నలుగురూ చేరినప్పుడు, సుబ్బన్న ఇలా అన్నాడు. "విస్సప్ప చెల్లెలు శ్రద్ధతోనూ అభిమానంతోనూ కల్పించి జాగ్రత్తగా సబ్బుపెట్టెలో అమిర్చి ఇచ్చిన పూలమాల మూల పడింది. భర్తృహరి సుభాషితంలా నేను రచించిన గీతమాల నా గొంతుకలోనే జీర్ణించిపోయింది. విస్సప్ప, ఉపన్యాససన్యాసం చేయవలసి వచ్చింది. మనవాడు ఆశపడి అధిగమించపోయిన అధ్యక్షపదవి అడుగంటిపోయింది. ఇదంతా వెంకటేశ్వర మహత్యం. "అయితేం, మించిపోయినదేమీ లేదు. మీరు ఈ సంవత్సరం రామయ్యతో కలిసి చదువుతారు. మీరు తంటాలుపడి, వాణ్ణి Pass చేయించండి. అప్పుడు ఆ సంగతి వెంకటేశ్వర్లకు తెలియకుండా, వాడికి సంబంధం లేకుండా, మనం స్వంత పార్టీ ఏర్పాటు చేసుకుందాం". సుబ్బన్న ముగించగానే, విస్సప్ప అన్నాడూ- "ఒరే, వీడికి వెంకటేశ్వర్ల వాగ్ధోరణి అలవడింది" అని. అంటే నేనన్నాను "ఎంత చెడిపోయినా, మన సుబ్బన్న కవికాదురా!" అని. ★